# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-04-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు – 2026కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు.**

**2. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అగ్నిమాపక శాఖకు చెందిన నూతన వాహనాలు, వివిధ పరికరాలను ఈ రోజు ప్రారంభించనున్నారు.**

**3. సమాజంలో మాదక ద్రవ్యాల వాడకం తీవ్రమవుతున్న తరుణంలో ఈ సమస్యను సమష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు.**

**4. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన నీటిని అందజేస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు.**

**5. పిఎం సూర్య ఘర్ పథకం ద్వారా గృహ అవసరాలకు కోతలు లేని విద్యుత్ సాధ్యమవుతుందని పల్నాడు జిల్లా ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు – 2026కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. ఇప్పటికే ఈ బిల్లు ఉభయ సభలు ఆమోదం పొందడం, తాజాగా రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మన రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉండి, దిశానిర్దేశం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి, ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పార్లమెంట్ సభ్యులందరికీ సామాజిక మధ్యమం ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల విజయమని, ముఖ్యంగా అమరావతి రైతుల విజయమని పేర్కొన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అగ్నిమాపక శాఖకు చెందిన నూతన వాహనాలు, వివిధ పరికరాలను ఈ రోజు ప్రారంభించనున్నారు. అమరావతిలోని పెరేడ్ గ్రౌండ్స్ లో సాయంత్రం నిర్వహించే ఈ కార్యక్రమంలో సుమారు 33 కోట్ల రూపాయలతో అగ్నిమాపక శాఖ కొత్తగా సమకూర్చుకున్న 25 అధునాతన నీటి ట్యాంకర్లు, 40 తక్షణ స్పందన వాహనాలు, 50 గాలితో నింపే రబ్బరు పడవలు, 30 శ్వాస ఉపకరణ కంప్రెసర్లు ఉన్నాయి.

--------------------------

'జలధార – జలహారతి' కార్యక్రమాన్ని కలెక్టర్లు, జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతాంశంగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో జలధార – జలహారతి కార్యక్రమం అమలుపై అధికారులతో ఆయన నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాల కలెక్టర్లతో సహా జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరిగిన తీరుపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. కార్యక్రమం మొదలు పెట్టిన తొలి రోజునే నంద్యాల, పశ్చిమ గోదావరి జిల్లాలు వంద రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయడంపై ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపాధి హామీని అనుసంధానం చేయాలన్నారు.

---------------------------

సమాజంలో మత్తుపదార్థాల వాడకం తీవ్రమవుతున్న తరుణంలో ఈ సమస్యను సమష్టిగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్ర, మహిళా, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్‌తో కలిసి 'నివృత్తి' డీఅడిక్షన్ కేంద్రాన్ని ఆయన నిన్న ప్రారంభించారు.

---------------------------

కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో నాలుగు దశాబ్దాల క్రితం కేవలం 2 వేల మందికి అన్న వితరణతో ప్రారంభమైన కార్యక్రమం నేడు రోజుకు 2 లక్షల 80 వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందించే స్థాయికి చేరిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 1985 ఏప్రిల్ 6న ఆనాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించారని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన నీటిని అందజేస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. ఇందుకోసం సుమారు 14 వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేస్తోందని తెలిపారు. చిత్తూరు మున్సిపాలిటీ పరిధిలో రోడ్లను, డంపింగ్ యార్డ్ ను ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

దేశంలో వ్యాపార నిర్వహణను సులభతరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్ విశ్వాస్ బిల్లు – 2026ను పార్లమెంట్ ఇటీవల ఆమోదించింది. ఈ బిల్లుతో జైలు శిక్షల స్థానంలో పౌర జరిమానాలను ప్రవేశపెట్టి, నేర తీవ్రతకు అనుగుణంగా శిక్షలను హేతుబద్ధీకరించడం, చిన్నపాటి పొరపాట్లకు, సాంకేతిక ఉల్లంఘనలకు జైలు శిక్ష విధించే నిబంధనలను తొలగించడమే ప్రధాన ఉద్దేశ్యం. ఈ బిల్లు మొత్తం 23 మంత్రిత్వ శాఖలకు చెందిన, 79 కేంద్ర చట్టాల పరిధిలోని 784 నిబంధనలను సవరిస్తుంది. 717 నిబంధనలు నేరాల జాబితా నుండి తొలగించబడ్డాయి. పాతపడిపోయిన, అనవసరమైన వెయ్యికి పైగా నిబంధనలను హేతుబద్ధం చేయడం ద్వారా ఈ బిల్లు నియంత్రణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది.

---------------------------

రాష్ట్రంలో ఎల్‌పిజి, పెట్రోల్, డీజిల్, ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్ తెలిపారు. విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) డైరెక్టర్ సురేష్ కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశాన్ని ఆమె నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ..

వాయిస్..25 సెకన్లు

ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టరు జి. సురేష్ కుమార్ మాట్లాడుతూ.. గత ఐదు వారాలుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావం కొంత మేర చమురు, సహజ వాయువు సరఫరాపై ఉన్నప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో సమర్థంగా పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని తెలిపారు.

---------------------------

ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. 1948 ఏప్రిల్ 7వ తేదీన ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ – డబ్ల్యూ. హెచ్. ఓ ఏర్పాటైంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు మెరుగైన ఆరోగ్యంతో జీవించాలన్న లక్ష్యంతో డబ్ల్యూ. హెచ్.ఓ పిలుపుమేరకు 1950 ఏప్రిల్ 7వ తేదీ నుండి ప్రతిఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ – ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య నిన్నటి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ క్రికెట్ స్టేడియంలో రాత్రి ఏడు గంటల 30 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభం కాగా కొద్దిసేపటికే భారీ వర్షం రావడం, ఎంత సేపటికీ తగ్గకపోవడంతో అంపైర్లు మ్యాచ్ ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరు జట్లకు ఒక్కో పాయింట్ కేటాయించారు.

అసోంలోని గౌహతి వేదికగా ఈ రోజు రాజస్థాన్ రాయల్స్, ముంబయ్ ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. రాత్రి ఏడు గంటల 30 నిముషాలకు మ్యాచ్ ప్రారంభం అవుతుంది.

---------------------------

దక్షిణ కోస్తా, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం విస్తరించి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రాయలసీమ, దాని పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం ఇప్పుడు తెలంగాణ, దాని పరిసర ప్రాంతాలపై కేంద్రీకృతమై ఉందని వాతావరణ కేంద్ర అధికారిణి జి. లక్ష్మి పేర్కొన్నారు. ఈ ఉపరితల ఆవర్తనం నుండి రాయలసీమ, తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి విస్తరించి ఉందన్నారు. ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలో ఈరోజు తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని పేర్కొన్నారు.

మరోవైపు తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా

కురిసే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

పిఎం సూర్య ఘర్ పథకం ద్వారా గృహ అవసరాలకు కోతలు లేని విద్యుత్ సాధ్యమవుతుందని జిల్లా ఇంచార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. పల్నాడు జిల్లా, నాగేశ్వరపురం తండాలో 79 గృహాలకు పీఎం సూర్య ఘర్ పథకంలో సౌర ఫలకాల ఏర్పాటును ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో వ్యవసాయ కనెక్షన్లకు సైతం సౌర విద్యుత్ అందిస్తామని వెల్లడించారు.

======================